సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 23 । మార్చి । 2025





సంకీర్ణ ప్రభుత్వాలతోనే సుస్థిర పాలన

సంకీర్ణ ప్రభుత్వాలతో సుస్థిర పాలన సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$38^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కార్మికులంతా లేబర్ కార్డులు పొందాలి



ఎంజీఎం: భవన నిర్మాణ, ఇతర కార్మికులు తప్పనిసరిగా లేబర్ కార్డు కలిగి ఉండాలని వరంగల్ జిల్లా అదనపు జూనియర్ న్యాయమూర్తులు నందికొండ రితిక, హారిక అన్నారు. శనివారం సెంట్రల్ జైలు ప్రాంగణంలో నిర్మిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. కార్మికులకు వర్తించే వివాహ బహుమతి, ప్రసూతి లబ్ధి, ప్రాణాంతక ప్రమాదాల లబ్ధి, ప్రమాదాలు జరిగినప్పుడు ఆర్థిక సాయం అందించే, సాధారణ మరణ లబ్ధి, జాతీయ పింఛన్ వంటి మొదలగు పథకాల గురించి తెలిపారు. లేబర్ కార్డుల జారీ, పథకాల అమలులో జాప్యం ఉంటే న్యాయసేవాధికార సంస్థలకు తెలపాలని సూచించారు. అనంతరం న్యాయమూర్తులు కార్మికులకు లేబర్ కార్డులను అందించారు. ఈసదస్సులో వరంగల్ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సురేశ్, అధికారులు నారాయణస్వామి, శరవణన్ కుమార్ కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పరీక్షలు



విద్యారణ్యపురి: హనుమకొండ, వరంగల్ జిల్లాలో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం హిందీ పరీక్ష నిర్వహించారు. హనుమకొండ జిల్లాలో 67 పరీక్ష కేంద్రాల్లో 11,971 మంది విద్యార్థులకుగాను 11,967 మంది హాజరయ్యారు. వారిలో నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ వాసంతి తెలిపారు. వరంగల్ జిల్లాలో 49 పరీక్ష కేంద్రాల్లో 9,224 మంది విద్యార్థులకు 9,208 మంది విద్యార్థులు హాజరవ్వగా.. వారిలో 16 మంది గైర్హాజరైనట్లు వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్ తెలిపారు.

రైలు పట్టా ముక్కపై విచారణ

కాజీపేట రూరల్: కాజీపేట–వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ ప్రత్యేక రైలు వెళ్తున్న ట్రాక్‌పై ఇనుప (పట్టా) ముక్కను తోసుకుంటూ వెళ్లిన ఘటనపై శనివారం కాజీపేట, వరంగల్ రైల్వే అధికారులు విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఎంతో పటిష్ట బందోబస్తు మధ్య ప్రయాణిస్తున్న జీఎం ప్రత్యేక రైలు వెళ్తున్న ట్రాక్‌లో రైలు పట్టాపై ఎలాంటి ఘటన జరగలేదని కొందరు రైల్వే పోలీస్ అధికారులు అంటున్నారు. సెక్షన్‌లో కొందరు రైల్వే ఇంజినీరింగ్ అధికారులు రైల్వే సిబ్బందిని వేధింపులకు గురి చేస్తున్నారని, వారికి ఎదురు మాట్లాడలేని పరిస్థితి ఉంటుంది కాబట్టి కొందరు ఇలాంటి ఘటనలకు పాల్పడి కిందిస్థాయి ఉద్యోగులపై రుద్దేందుకు ఉండొచ్చని, ఇందుకు కొందరు అధికారులు సహకారం ఇచ్చారా? అనే కోణంలో ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు. జీఎం ప్రత్యేక రైలులో వెళ్తున్న సమయంలో ఒక శబ్దం వచ్చింది కానీ, అంత పెద్ద విషయం కాదని, జీఎం ప్రత్యేక రైలుకు ఎలాంటి ముప్పు కలిగించేది కాదని కొందరు అంటున్నారు. ప్రాథమిక విచారణలో జీఎం రైలుకు ఎలాంటి ప్రమాదం జరగలేదని నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు.

ఎంపీడీఓలను రివర్షన్ చేయవద్దు..



హన్మకొండ అర్బన్: కొత్తగా గ్రూప్–2 నియామకాల వల్ల గతంలో పదోన్నతి ద్వారా ఎంపీడీఓలుగా పని చేస్తున్న వారిని రివర్షన్ చేయవద్దని వరంగల్, హనుమకొండ జిల్లాల టీజీఓస్ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో రెండు జిల్లాల నాయకులు పాల్గొన్ని పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో పాల్గొన్న వరంగల్ శాఖ జాయింట్ సెక్రటరీ పాక శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్యనిర్వాహక అధికారులందరికీ అలవెన్సులు ఇవ్వాలని, ఆయుష్, పశుసంవర్థక శాఖలో పదోన్నతులు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్మోహన్ రావు, హనుమకొండ డీఆర్డీఓ మేన శ్రీను, డీసీఓ సంజీవరెడ్డి, టీజీఓస్ వరంగల్ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు ఫణికుమార్, కోలా రాజేశ్‌కుమార్‌గౌడ్, డాక్టర్ ప్రవీణ్, పెద్ది ఆంజనేయులు ఈగ వెంకటేశ్వర్లు, మురళీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఇద్దరు స్నేహితులు కలిసినా.. బంధువులు ఇంటికొచ్చినా.. ఖాళీగా ఉండి ఏం తోచకపోయినా.. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునేదాకా రోజుకు రెండు అంతకు మించి.. చాయ్‌లు తాగుతూనే ఉంటారు. చాయ్ ఒక సెంటిమెంట్. చాయ్.. ఒక ఫ్రెండ్‌షిప్ బాండింగ్. చాయ్ ఒక రిలేషన్. ఒక ఎనర్జీ. ఎందరో సినీ కవులు ఎన్నో రకాలుగా చాయిని వర్ణించారు. కొత్త రుచులెన్నున్నా.. సరికొత్తగా చాయి రూపాంతరం చెందుతూనే వస్తోంది. ఇన్నాళ్లు లొట్టలేసుకుని తాగిన మనం.. ఇకపై కరకరా నమిలేద్దాం. 'గ్రేటర్'లో పెరుగుతున్న బిస్కెట్ కప్ చాయ్‌పై 'సాక్షి' సండే స్పెషల్.

సాక్షి, వరంగల్

సండే స్పెషల్

చాయ్ తాగండి కప్పు తినండి


ఓరుగల్లులో విస్తరిస్తున్న కొత్త ట్రెండ్

- కొత్త రుచిని ఆస్వాదిస్తున్న టీ ప్రియులు
- బిస్కెట్ చాయ్‌తో పర్యావరణం, ఆరోగ్యం

పొగలు కక్కే చాయిని ఒడిసిపట్టేందుకు గాజు.. ప్లాస్టిక్.. పేపర్.. మట్టి.. స్టీల్ ఇలా ఎన్నో రకాల పాత్రలున్నాయి. కానీ వీటిలో చాయి తాగితే మళ్లీ కడగాలి. లేదా పడేయాలి. బిస్కెట్‌తో తయారు చేసిన కప్పుల్లో తాగితే మాత్రం ఆ గ్లాస్‌ను కరకరా నమిలేయొచ్చు. మంచి రుచి.. సరికొత్త అనుభూతిని సొంతం చేసుకోవచ్చు. పేపర్ కప్‌లో టీ తాగే బదులు బిస్కెట్ కప్పులో తాగేందుకు నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారు. నగరంలోని వివిధ టీస్టాళ్లలో లభ్యమవుతున్న పర్యావరణ హిత, ఆరోగ్యకరమైన బిస్కెట్ కప్పులో టీ తాగుతూనే ఆ కప్పునే తినేస్తూ రుచిని ఆస్వాదిస్తున్నారు.

ఆరోగ్యం పదిలం

బిస్కెట్ టీకప్పు అనగానే ఒకే రకం అనుకునేరు. రాగి, బియ్యం పిండి, రాగుల గోధుమలు, మొక్కజొన్న పిండి, తేనె, చక్కెరతో తయారు చేసిన ఈ బిస్కెట్ టీ కప్పు ఆరోగ్యానికి మేలు చేస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు. ఆ కప్పులో టీ ఆస్వాదిస్తూనే ఆ తర్వాత తింటున్నారని ఓరుగల్లు ఎంటర్‌ప్రైజెస్ ఎడిబుల్ బిస్కెట్ కప్స్ నిర్వాహకులు కరుణాకర్, సందీప్ చెబుతున్నారు. పేపర్ కప్పులో టీ తాగడం వల్ల భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉండడాన్ని దృష్టిలో ఉంచుకుని ఈబిస్కెట్ టీకప్స్ తయారు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు.



శ్రేయస్కరం

పేపర్ కప్‌లో హైడ్రోఫోబిక్ లేయర్ ఉండడం వల్ల కేన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. ఆరోగ్యానికి హానికరం. పేపర్ కప్పులు భూమిలో కలిసిపోయేందుకు 200 సంవత్సరాలు పడుతుంది. వీటి వల్ల కాలుష్యం ఎక్కువై మంచినీరు కలుషితమవుతోంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పర్యావరణానికి మేలు చేయాలని, ప్రజల ఆరోగ్యం బాగుండాలని ఓరుగల్లు బిస్కెట్ టీ కప్పుని అందుబాటులోకి తీసుకొచ్చాం. - కరుణాకర్, సందీప్

నోరూరిస్తున్న ఫ్లేవర్స్

కస్టమర్లు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తున్నారని పలు టీస్టాళ్ల నిర్వాహకులు చెబుతున్నారు. టీ, కాఫీ, పాలు, ఐస్ క్రీమ్స్, మిల్క్ షేక్స్ ఇలా వేటికైనా ఈ కప్పులను వినియోగిస్తున్నారు. ఈ కప్పులో ఎంత వేడి పానీయం పోసినా 15 నిమిషాల పాటు మెత్తబడకుండా ఉంటుంది. రుచులకు అనుగుణంగా చాక్లెట్, స్ట్రాబెర్రీ, వెనీలా, యాలకులు తదితర ఫ్లేవర్లతో తయారుచేస్తున్నారు. హాట్ అండ్ కోల్డ్ బేవరేజేస్‌కు ఇది ఉపయోగపడుతుంది. తాగిన తర్వాత తినొచ్చు కూడా..

ఆకలి కూడా తీరినట్లనిపిస్తుంది..



బైక్ షోరూమ్‌లో పనిచేస్తా. ప్రతిరోజూ సాయంత్రం నా స్నేహితుడు వినీల్‌తో కలిసి నక్కలగుట్టలోని ఈ టీస్టాల్‌కు వస్తుంటా. బిస్కెట్‌టీ కప్పు చాయ్‌ని ఆస్వాదిస్తున్నాం. ఇది ఆరోగ్యానికి మంచిది. టీ తాగాక ఆ కప్పును కూడా తినడంతో కాస్త ఆకలి కూడా తీరినట్లు అనిపిస్తుంది. - నిఖిల్, వరంగల్

వచ్చిన ప్రతీసారి టీ తాగుతా..



మాది పరకాల. ఫెర్టిలైజర్ దుకాణంలో పనిచేస్తా. పనిమీద హనుమకొండకు వారం వారం వస్తుంటా. ఇక్కడికి వచ్చినప్పుడల్లా బిస్కెట్ టీ కప్పులో ఛాయ్ తాగేందుకు వస్తా. విభిన్న రకాల బలవర్ధకమైన పిండి, ఇతర పదార్థాలతో తయారైన ఈ కప్పును తిన్నప్పుడు రుచి బాగుంటుంది. - శ్రావణ్ కుమార్, పరకాల

నీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ

నగర మేయర్ గుండు సుధారాణి



దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: వేసవిలో నీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం ఆమె.. దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌తోపాటు పుప్పాలగుట్ట, చార్‌బౌళి వాటర్ ట్యాంకులను సందర్శించారు. వాటి పరిధిలోని డివిజన్లలో నీటి సరఫరా తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి నాణ్యతను పరిశీలించారు. సమర్థవంతంగా నిర్వహించేందుకు తగు సూచనలు చేశారు. దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ పరిధిలో 57 లీకేజీలు గుర్తించి, 39 అరికట్టామని తెలిపారు. 3 ప్రాంతాల్లో నీరు కలుషితం అవుతున్నట్లు గుర్తించి 2 ప్రాంతాల్లో అరికట్టామని మరో ప్రాంతంలో అరికట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో బల్దియా నిర్వహిస్తున్న ఈ–సేవ కేంద్రాన్ని తనిఖీ చేసి పన్ను వసూళ్ల తీరుతోపాటు ఎల్ఆర్ఎస్ చెల్లింపుల తీరును ఆపరేటర్ అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌ను పరిశీలించారు. చార్‌బౌళి ట్యాంక్ ఆవరణలోని ప్రాంతాన్ని 2, 3 రోజుల్లో శుభ్రం చేయడంతోపాటు వాటర్ ట్యాంకుకు పెయింటింగ్ వేయించాలని, టాయిలెట్లు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, ఈఈ శ్రీనివాస్, డీఈలు రంగారావు, కృష్ణమూర్తి ఏఈలు విజయలక్ష్మి, హబీబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను వినియోగించుకోవాలి..

ప్రభుత్వం కల్పించిన ప్లాట్ల లేఔట్ల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. శనివారం వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ పురోగతి, నాన్ కమర్షియల్‌గా అనుమతి పొంది కమర్షియల్‌గా వినియోగిస్తున్న భవనాల గుర్తింపు, నాలాల విస్తరణ తదితర అంశాలపై అధికారులతో మేయర్ సమీక్షించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. 26 ఆగస్టు 2020 వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్ల, నాన్‌లేఔట్‌లకు ఈనెల 31 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపునకు ప్రభుత్వం 25 శాతం రాయితీకి అవకాశం కల్పించిందని.. అర్హులు వినియోగించుకోవాలని సూచించారు. క్రమబద్ధీకరించని ప్లాట్లల్లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబోమని మేయర్ స్పష్టం చేశారు. ఏప్రిల్ 15 నుంచి గ్రేటర్ వరంగల్ పరిధిలో ప్రధాన నాలాల విస్తరణతో పాటు నాలాలకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని మేయర్ ఆదేశించారు. సమావేశంలో బల్దియా సిటీ ప్లానర్ రవీందర్, ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, ఖలీల్, నస్రీన్ భాను, ఇర్షాద్, రజిత, టీపీఎస్‌లు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణలో భాగంగా కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల్లో శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు ఎర్త్ అవర్ పాటించారు. విద్యుత్ లైట్లు, ఇతర ఉపకరాలు పూర్తిగా ఆఫ్‌చేశారు. కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలతో ఈ కార్యక్రమం అమలు చేసినట్లు తెలిపారు. - హన్మకొండ అర్బన్

హెచ్ఐవీ, ఎయిడ్స్‌ని నివారించాలి

నయీంనగర్: జిల్లాలో హెచ్ఐవీ ఎయిడ్స్‌ను వంద శాతం నివారించాలంటే అన్ని స్థాయిల్లో హెచ్ఐవీ పరీక్షలు జరిపించి, హెచ్ఐవీతో జీవిస్తున్న వారిని గుర్తించి వారికి వైద్య సేవలందించాలని హనుమకొండ డీఎంహెచ్ఓ అప్పయ్య అన్నారు. శనివారం హనుమకొండ ప్రభుత్వ ఛాతి–టీబీ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులతో అడ్వకసీ మీటింగ్ వరల్డ్ టీబీ డేపై అవగాహన కార్యక్రమం, సంపూర్ణ సురక్ష కేంద్రం ద్వారా అమలు జరిగే హెచ్ఐవీ, ఎస్‌టీఐ, హెచ్‌బీఎస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంపై అవగాహన కార్యక్రమాన్ని హాస్పిటల్ సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ ప్రివెన్షన్ యూనిట్ ప్రోగ్రాం మేనేజర్ స్వప్న మాధురి మాట్లాడుతూ.. టీబీ మహమ్మారిని అంతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీబీ హాస్పిటల్ సూపరింటెండెంట్ పంతం సునీత, డాక్టర్ శ్రీలక్ష్మి, టీటీసీఓ హిమబిందు, మేనేజర్ ఇక్బాల్ బాషా, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా కోట

'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ సత్యశారద



మ్యూజియం భవనాన్ని పరిశీలిస్తున్న 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ సత్యశారద

ఖిలా వరంగల్: పర్యాటక కేంద్రంగా ఖిలా వరంగల్‌ను తీర్చిదిద్దుతామని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, కుడా పీఓ అజిత్‌రెడ్డి, పర్యాటక శాఖ అధికారి శివాజీ, రాష్ట్ర పురావస్తు శాఖ అధికారి మల్లునాయక్, ఈఈ భీంరావు, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, అధికారులతో కలిసి శనివారం వారు ఖిలా వరంగల్ కోటను సందర్శించారు. మ్యూజియం భవనం, ఖుష్‌మహల్, శృంగారపు బావి, శిల్పాల ప్రాంగణం, ఏకశిల గుట్ట, చిల్డ్రన్స్ పార్కు, బండ్, రాతి, మట్టి కోటలను పరిశీలించారు. పర్యాటక, సాంస్కృతిక ప్రదేశంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడారు. కోటలో పర్యాటకులు సేదతీరేందుకు కాటేజీల నిర్మాణాలు, సుందరీకరణ పనులు చేపడతామని తెలిపారు. రామప్ప మాదిరిగానే శిల్పాల ప్రాంగణంలోని శిల్పాలు కూడా యునెస్కో వారసత్వ గుర్తింపు పొందే ఆస్కారం ఉందన్నారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వేయి స్తంభాల గుడి, భద్రకాళి దేవాలయం, రామప్ప, లక్నవరం, ఖిలా వరంగల్ కలిపి పర్యాటకులు సందర్శించేలా ఒకరోజు టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర పురావస్తుశాఖ అధికారి నవీన్, కోట కోఆర్డినేటర్ శ్రీకాంత్, కోట కోఆర్డినేటర్ అజయ్, చరిత్రకారుడు అరవింద్‌ఆర్య, అధికారులు పాల్గొన్నారు.

206 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

వరంగల్: రబీ సీజన్‌లో 206 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ కలెక్టర్ సత్యశారద తెలిపారు. కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై శనివారం అధికారులు, స్టేక్‌హోల్డర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత అంచనా ప్రకారం రబీలో 2,14,513 మెట్రిక్ టన్నుల సన్నరకం, 44,912 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. డీఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిష్టయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా సహకార అధికారి నీరజ పాల్గొన్నారు.

వేగంగా రహదారులు, జంక్షన్ల అభివృద్ధి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య





మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, రహదారి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: జిల్లా పరిధిలో జాతీయ రహదారుల నిర్మాణం, జంక్షన్ల పనులు సత్వరం పూర్తిచేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సిద్దిపేట, ఎల్కతుర్తి జాతీయ రహదారి (765) జిల్లా పరిధిలో కొనసాగుతున్న పనుల్ని సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ రహదారి మొత్తం 63.64 కిలోమీటర్లు ఉండగా, జిల్లాలో 17.5 కిలోమీటర్ల పరిధి ఉందన్నారు. దీనిలో ఇప్పటి వరకు 16.5 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యిందని, ఎల్కతుర్తి, ముల్కనూరు మధ్యలో పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అదే విధంగా ఏప్రిల్ 14 నాటికి ఎల్కతుర్తి మండల కేంద్రంలో 'కుడా' ఆధ్వర్యంలో చేపడుతున్న జంక్షన్ అభివృద్ధి పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జాతీయ రహదారుల శాఖ డీఈఈ మనోహర్, తహసీల్దార్ జగత్‌సింగ్, సంబంధిత అధికారులు ఉన్నారు.

'మిషన్ వాత్సల్య' జాబితా సిద్ధం చేయాలి..

మిషన్ వాత్సల్య పథకానికి అర్హుల జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాస్థాయి కమిటీ ఈ పథకానికి ఇప్పటికే 216 మందిని ఎంపిక చేసిందన్నారు. 7కేటగిరీల్లో ఎంపిక ఉంటుందన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి, బాల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ చందర్‌రావు, సీడీపీఓలు విశ్వజ, స్వాతి, స్వరూప, ఇతర అధికారులు ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల పనులు సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్ర భవనాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, టాయిలెట్స్ మరమ్మతులు సత్వర పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు.

పర్యావరణంపై మరింత అవగాహన అవసరం

ప్లాస్టిక్ నియంత్రణ, మొక్కల పెంపకం, పరిసరాల్లోని చెత్తను మున్సిపల్ సిబ్బందికి చేరవేసే వంటి పర్యావరణ పరిరక్షణకై ఉపయోగపడే అనేక అంశాలపై ప్రజల్లో మరింత అవగాహన రావాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో శనివారం రాత్రి డబ్ల్యూడబ్ల్యూఎఫ్, ప్రజ్వల్ సంస్థల ఆధ్వర్యంలో 'ఎర్త్ అవర్' కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ ఎరువుల వాడకంపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్న పలువురు గ్రామ కార్యదర్శులకు జ్ఞాపికలను అందజేశారు. ఈసందర్భంగా సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రాష్ట్ర డైరెక్టర్ ఫరీద, వరంగల్ డీసీఓ సంజీవరెడ్డి, ఆయా సంస్థల ప్రతినిధులు వంశీకృష్ణ, వివిధ సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రూబిజెస్ట్ సాంస్కృతిక వేడుకలు



కేయూలోని ఆడిటోరియంలో విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రూబిజెస్ట్‌లో భాగంగా శనివారం వార్షిక సాంస్కృతిక వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఈవెంట్లలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. సంప్రదాయ, ఆధునిక నృత్యాలతోపాటు జానపద గేయాలకు నృత్యాలు కూడా చేశారు. ఈ ఉత్సవాల ప్రారంభ సన్నాహక సమావేశంలో ఆ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.భిక్షాలు మాట్లాడుతూ.. విద్యార్థులు తమలోని సంస్కృతిక ప్రతిభను చాటేందుకు ఇది ఒక వేదిక అన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కో–ఆర్డినేటర్ వేణుగోపాల్, కన్వీనర్ కందులు సాయి తరుణ్ పాల్గొన్నారు. రూబిజెస్ట్ ఉత్సవాలు ముగిశాయి.

60 కిలోల గంజాయి స్వాధీనం

మామునూరు: అంతర్రాష్ట్ర మాదక ద్రవ్యాల రవాణా ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి 60 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు మామునూరు ఇన్‌స్పెక్టర్ ఓ.రమేశ్ తెలిపారు. వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో వాహన తనిఖీలు చేస్తుండగా.. పోలీసులను చూసి పరారవుతున్న సిద్ధాంత్ మాలి, లలితా మంజూ, మౌనిక నాయక్, పింకి నాయక్‌ను వెంటబడి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగులను పరిశీలించగా.. 60 కేజీల ఎండు గంజాయి లభించింది. వారిని పోలీస్ స్టేషన్‌కు విచారించి విచారించగా గంజాయిని ఒడిశా నుంచి వరంగల్‌కు చేరవేసి పుణేబాయ్ అనే వ్యక్తికి విక్రయిస్తామని చెప్పారు. నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.

రిటైర్డ్ ఆచార్యులు లక్ష్మణమూర్తి కన్నుమూత

కవి, బహు భాషా పండితుడికి ఘన నివాళి



లక్ష్మణమూర్తి (ఫైల్)

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఆంగ్ల విభాగం రిటైర్డ్ ఆచార్యులు పెరంబదూరు లక్ష్మణమూర్తి(85) శనివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులకు సేవలందించారు. కేయూ ఆంగ్ల విభాగం మొదటి తరం ఆచార్యుడిగా పేరుపొందారు. ఆవిభాగాధిపతిగా, బీఓఎస్‌గా, ఆర్ట్స్ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సూర్యాపేట సమీపంలోని చందుపట్ల గ్రామానికి చెందిన లక్ష్మణమూర్తి హనుమకొండలో స్థిరపడ్డారు. కాకతీయ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా చేరారు. తెలుగు, సంస్కృతం, ఆంగ్లంలోనూ పుస్తకాలు రాశారు. కేయూ ఆంగ్ల విభాగంలో అనేక మంది పరిశోధకులకు మార్గదర్శకత్వం వహించారు. 1999లో ఉద్యోగ విరమణ పొందిన ఆయన హనుమకొండలోనే స్థిరపడ్డారు. కొంత కాలంగా ఆయన అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో శనివారం కన్నుమూశారు. ఆయన మృతిపై అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్ పంజాగుట్ట శ్మశానవాటికలో ఈనెల 23న ఉదయం 11 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని సమాచారం.

ఇంటర్ గురుకులాల్లో ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్ కె. ఇందుమతి శనివారం తెలిపారు. 2025లో పదో తరగతి పరీక్షలకు హాజరైన బాలబాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు http:tgrjc.gov.in దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 040–24734899, 9866559727 నంబర్లను సంప్రదించాలని జిల్లా కో–ఆర్డినేటర్ ఇందుమతి సూచించారు.

4వ తేదీన గిరిజన భవన్‌లో జాబ్ మేళా

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో వచ్చే నెల 4వ తేదీన ఉదయం 10 గంటలకు హనుమకొండలోని గిరిజన భవన్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి చిత్రమిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఎఎన్ఎం, జీఎన్ఎం, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ చదవిన, ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు తమ బయోడేటా, విద్యార్హత జిరాక్స్ ప్రతులతో సకాలంలో జాబ్ మేళాకు హాజరు కావాలని పీఓ పేర్కొన్నారు.

అరచేతిలో విద్యుత్ సేవలు



యాప్ రూపొందించిన టీజీ ఎన్పీడీసీఎల్ | 20 ఫీచర్లతో అందుబాటులోకి..

సాక్షి మీకోసం

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో టీజీ ఎన్పీడీసీఎల్ ఓ యాప్‌ను రూపొందించింది. సుమారు 20 ఆధునిక ఫీచర్లతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యాప్ ద్వారా ఇంట్లోనే ఉండి సమస్యలపై ఫిర్యాదు చేయడంతోపాటు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, నూతన సర్వీస్‌ల మంజూరు, పేరు మార్పు వంటి సేవలు పొందే అవకాశముంది.

రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్: ఎక్కడ ఎలాంటి ఘటన జరిగినా ఇందులో జీపీఎస్ లోకేషన్ ద్వారా వినియోగదారుడి ఫోన్ కెమెరా నుంచి ఆ ఘటన ఫొటో తీసి పంపవచ్చు. తద్వారా రిపోర్ట్ నేరుగా సంబంధిత అధికారికి వెళ్తుంది. దీంతో సమస్య త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

కన్స్యూమర్ గ్రీవెన్స్: వినియోగదారుడి సమస్యలు నేరుగా ఇందులో పొందుపరచవచ్చు. వినియోగదారుడి మీటర్ నంబర్, సమస్య వివరాలు ఇందులో నమోదు చేస్తే సమస్యను పరిష్కరిస్తారు. విద్యుత్‌కు సంబంధించి ఏ అంశమైనా ఫిర్యాదు చేసే సౌకర్యం ఈ యాప్‌లో అందుబాటులో ఉంది. ఫిర్యాదు స్టేటస్ చూసుకునే సౌలభ్యం ఉంది. సమస్య పరిష్కారంపై సంతృప్తి చెందకపోతే పునరావృతం చేసుకునే వీలుంది.

సెల్ఫ్ రీడింగ్: ఈ యాప్ ద్వారా వినియోగదారులు సెల్ఫ్ రీడింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ప్రతీ నెల నిర్ణీత తేదీన వారి విద్యుత్ బిల్లులను సెల్ఫ్ మీటర్ రీడింగ్ తీసుకోవచ్చు.

పే బిల్స్: నెలవారీ విద్యుత్ బిల్లులను వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదు చేసుకొని చెల్లించవచ్చు. దీంతో సమయం ఆదా అవుతుంది. బిల్ కౌంటర్లకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

బిల్ హిస్టరీ: వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లుల గత చరిత్ర ఇందులో చూసుకోవచ్చు. తద్వారా ప్రతీ నెలా బిల్లు ఎంత వస్తుంది పోల్చుకోవచ్చు. అలాగే విద్యుత్ వినియోగం ఏ నెల ఎంత పెరిగిందో చూసుకుని పొదుపుగా వాడుకునే అవకాశం ఉంది.

ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ: ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లు వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకునే సౌకర్యముంది.

కొత్త సర్వీస్ స్థితి: కొత్త సర్వీసుల రిలీజ్ స్థితిగతులు ఎప్పటికప్పుడు అప్లికేషన్ నంబర్ ఎంటర్ చేసి తెలుసుకునే సౌకర్యం ఉంది. తద్వారా కొత్త సర్వీసుల మంజూరు వేగంగా జరుగుతుంది.

లింక్ ఆధార్– మొబైల్: వినియోగదారుల ఆధార్, మొబైల్ నంబర్లు లింక్‌తో విద్యుత్ బిల్లుల సమాచారం ఫోన్‌కు చేరుతుంది. దీంతో గడువులోగా బిల్లులు చెల్లించవచ్చు

కొత్త కనెక్షన్, పేరుమార్పు: కొత్త విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇందులో పొందుపరిచారు. దీంతోపాటు విద్యుత్ మీటర్ పేరు మార్పు, లోడ్‌కు సంబంధిదించిన వివరాలు ఇందులో ఉన్నాయి.

పవర్ కంజంప్షన్ గైడ్ లైన్స్: విద్యుత్ ఉపకరణాలు ఎంత వాడితే ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో ఇందులో వివరించారు.

టారిఫ్ డీటెయిల్స్: విద్యుత్ వినియోగం చార్జీల వివరాలు కేటగిరీల వారీగా ఇందులో ఉంటాయి. గృహ, గృహేతర వినియోగదారులు, పరిశ్రమలు, ఇతర కేటగిరీల వారీగా చార్జీల వివరాలు ఇందులో పొందుపరిచారు.

ఎనర్జీ సేవింగ్, సేఫ్టీ టిప్స్: విద్యుత్ ఉపకరణాలు వాడుతున్నపుడు పాటించాల్సిన పొదుపు సూచనలు, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇందులో వివరించారు.

ఫీడ్ బ్యాక్: వినియోగదారులకు అందిస్తున్న సేవలపై అభిప్రాయాన్ని పంచుకోవచ్చు. ఇది చాలా ముఖ్యం. సలహాలను అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకొని మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుంది.

మై అకౌంట్: మై అకౌంట్‌లో వినియోగదారుల పూర్తి వివరాలు ఉంటాయి. వారి మీటర్ తాలూకు వివరాలు, తదితర సమాచారం ఉంటుంది.

వినియోగదారుల బిల్లు సమాచారం: దీనిలో వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదు చేసి బిల్లు వివరాలు తెలుసుకోవచ్చు.

అధికారి వివరాలు: వినియోగదారుల పరిధిలోని అధికారి వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోచ్చు. వినియోగదారులకు ఎటువంటి సందేహాలున్న తమ పరిధిలోని అధికారిని ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు.

కాంటాక్ట్ అజ్: ఇందులో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు 1800 4250028, 1912 ఉంటాయి. వీటి ద్వారా సమస్యలు త్వరగా పరిష్కరించుకునే వెసులుబాటు ఉంది.

యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం



టీజీ ఎన్పీడీసీఎల్ యాప్‌పై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. అరచేతిలోకి విద్యుత్ సేవలు తీసుకెళ్లడానికి ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి యాప్‌ను ఆధునికీకరించి 20 రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

– మధుసూదన్‌రావు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ, హనుమకొండ

యాప్‌తో అనేక ప్రయోజనాలు



టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారా అనేక ప్రయోజనాలున్నాయి. వినియోగదారులు తమ మొబైల్ ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని సేవలు పొందవచ్చు. కార్యాలయాలకు రావాల్సిన సమయం, ఖర్చులు ఆదా అవుతాయి.

– గౌతం రెడ్డి, టీజీ ఎన్పీడీసీఎల్, ఎస్ఈ వరంగల్

ముగ్గురు చైన్ స్నాచర్లు, దొంగ అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీపీ సన్ ప్రీత్ సింగ్



వివరాలు వెల్లడిస్తున్న సీపీ

వరంగల్ క్రైం: మూడు వేర్వేరు ఘటనల్లో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ తెలిపారు. ఇందులో ముగ్గురు చైన్‌స్నాచర్లు ఉండగా మరొకరు దొంగ ఉన్నాడని, ఈ మూడు ఘటనల్లో నిందితుల వద్ద నుంచి సుమారు రూ.4.90 లక్షల విలువైన 77.750 గ్రాముల బంగారంతో పాటు రూ.8 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. ఖిలావరంగల్ కోటకు చెందిన చాపర్తి రాజేశ్ ఇస్త్రీ షాపు నిర్వహిస్తున్నాడు. దీని ద్వారా వచ్చే ఆదాయం జల్సాలకు సరిపోకపోవడంతో సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందులో భాగంగా హనుమకొండ రెడ్డికాలనీలో ఒంటరిగా వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల గొలుసు లాక్కెళ్లాడు. ఈ ఈఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేట్టారు. ఈక్రమంలో పెద్దమ్మ గడ్డ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో నాలుగు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు.

కాజీపేట పీఎస్ పరిధిలో మరో ఇద్దరు..

కాజీపేట పీఎస్ పరిధిలో జరిగిన రెండు చైన్‌స్నానింగ్ ఘటనల్లో మరో ఇద్దరు చైన్ స్నాచర్లను అరెస్ట్ చేసినట్లు సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఐనవోలు మండలానికి చెందిన తాళ్లపల్లి సంపత్‌కుమార్ ప్రస్తుతం నగరంలోని గోకుల్‌నగర్‌లో ఉంటూ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంపత్‌కుమార్, నడికూడకు చెందిన చుక్క మురళీ.. కిరాణాషాపుల్లో వస్తువులు కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ సదరు నిర్వాహకుల మెడలోని రోల్‌గోల్డ్ గొలుసులు లాకెళ్లారు.ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు సీపీ వెల్లడించారు.

కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగ..

కర్నాటకకు చెందిన కార్తీక్ ప్రస్తుతం వనస్థలిపురంలో ఉంటూ స్వాతికిరణ్ అనే వ్యాపారి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 18న స్వాతికిరణ్ తన వ్యాపార భాగస్వామి గూడమల్ల వినయ్‌కుమార్ కలిసి కాజీపేటలో హోటల్ వ్యాపార లావాదేవీల సంబంధించిన రూ.8లక్షలు తీసుకుని తన కారులో వెనుక డబ్బుల బ్యాగ్‌లను భద్రపర్చుకున్నాడు. రాత్రి 9 గంటల ప్రాంతంలో భీమారం సమీపంలోని ఓ హోటల్‌లో వారు సేద తీరారు. నిందితుడు కార్తీక్ భోజనానికి వెళ్తున్నట్లు నటిస్తూ కారులో భద్రపరిచిన బ్యాగును మాయం చేశాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీపీ వెల్లడించారు.

సంకీర్ణ ప్రభుత్వాలతోనే సుస్థిర పాలన

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి
- ముగిసిన జాతీయ సదస్సు



పరిశోధన పత్రాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ అధ్యాపకులు

కేయూ క్యాంపస్ : సంకీర్ణ ప్రభుత్వాలతో సుస్థిర పాలన సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా సెనేట్‌హాల్‌లో 'భారత సమాజంలో సంకీర్ణ ప్రభుత్వాలు, ప్రజాస్వామ్యం' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం సాయంత్రం ముగిసింది. ఈ ముగింపు సభలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంకీర్ణ రాజకీయాలు, ప్రభుత్వాలు బహుళ వర్గాల ప్రజల ఐక్యతకు ప్రతీకయే గాకుండా ప్రజలకు జవాబుదారీగా వ్యవహరిస్తాయన్నారు.

సంకీర్ణ రాజకీయాలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

ప్రజాస్వామ్యం బలోపేతం, సంపదకేంద్రీకరణ సంకీర్ణ రాజకీయాలతోనే సాధ్యమని ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు కె. శ్రీనివాసులు అన్నారు. ఈ సదస్సులో ఆయన ప్రధానవక్తగా పాల్గొని మాట్లాడారు. సంకీర్ణం కేవల రాజకీయాలకు మాత్రమే కాదని ఆర్థిక సామాజికంలోనూ అవసరం అన్నారు. సంకీర్ణానికి భారతీయ జాతీయ ఉద్యమం గొప్ప ఉదాహరణ అన్నారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి సంకినేని వెంకట్, యూజీసీ కోఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, మద్రాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడారు. ఆ విభాగం బీఓఎస్ చైర్మన్ గడ్డం కృష్ణయ్య, రిటైర్డ్ ఆచార్యులు రఘురాంరెడ్డి, జి వీరన్న,హరిప్రసాద్‌పాల్గొన్నారు. ఈ సదస్సులో 9 సెషన్లలో వంద మంది పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ పరిశోధన పత్రాలను పుస్తకం రూపంలోకి తీసుకురాగా వీసీ, రిజిస్ట్రార్ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు ఆవిష్కరించారు.

ఇక ఎత్తిపోసుడే..

- దేవాదుల–3 మోటార్ల ప్రారంభానికి అంతా సిద్ధం



పంప్‌హౌస్

హసన్‌పర్తి : దేవాదుల ప్రాజెక్టు మూడో దశ కింద దేవన్నపేటలో నిర్మించిన పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ చెరువులోకి నీటిని ఎత్తిపోయడానికి అంతా సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం లేదా సాయంత్రం మంత్రి చేతుల మీదుగా మోటార్ల ప్రారంభానికి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమానికి నీటిపారుదలశాఖ మంత్రా? ఇన్‌చార్జ్ మంత్రిని ఆహ్వానిస్తారా అనే విషయం అధికారులు స్పష్టంగా పేర్కొనడం లేదు. ఐదు రోజుల క్రితమే నీటిపారుదల శాఖ మంత్రి మోటార్లు ప్రారంభించడానికి వచ్చి కేవలం పూజలు చేశారు. ఆ రోజు అర్ధరాత్రి వరకూ మోటార్లు ప్రారంభించడానికి వేచి చూసి వెనుదిరిగారు. అప్పటికే పనులు పూర్తి కాకపోవడంతో ఆయన అధికారులపై సీరియస్సయ్యారు. ఇదిలా ఉండగా, పనులు పూర్తికి ఐదురోజుల సమయం పట్టింది. అధికారులు రాత్రింబవళ్లు పంప్‌హౌస్ వద్ద ఉంటూ పనులు పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేశారు.

ప్రత్యేక నిపుణుల రాక..

దేవాదుల ప్రాజెక్టు–3 కింద ఏర్పాటు చేసే మోటార్లు ఆస్ట్రియాకు చెందిన అండ్రీజ్ కంపెనీవి. మోటార్లు ఆన్‌చేస్తే మళ్లీ ఏదైనా సాంకేతిక సమస్యలు ఏర్పడకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. ఆ దేశానికి చెందిన ప్రత్యేక నిపుణులతో ట్రయల్ కోసం దేవన్నపేటలోని పంప్‌హౌస్‌కు చేరుకున్నారు. ట్రయల్ రన్ కోసం అంతా సిద్ధం చేశారు. ఆదివారం ట్రయల్ రన్ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అధికారులు రెండు రోజులుగా డ్రై రన్ కొనసాగిస్తున్నారు.

నకిలీ పురుగు మందుల ముఠా అరెస్ట్..

- రూ.78 లక్షల 63 వేల విలువైన మందులు, మిషనరీ, ప్రింటింగ్ సామగ్రి, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



నిందితులతోపాటు నకిలీ పురుగు మందులను చూపుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: ప్రముఖ కంపెనీల పేర్లతోపాటు గడువు తీరిన పురుగు మందులను రైతులకు అంటగడుతున్న ముఠాలోని ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.78లక్షల 63 వేల విలువైన నకిలీ పురుగు మందులు, మిషనరీ, ప్రింటింగ్ సామగ్రి, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీన చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్.. నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం వరంగల్ మట్టెవాడ బొడ్రాయి సమీపాన ప్రధాన నిందితుడు ఇరుకుళ్ల వేదప్రకాశ్ ఇంటిపై టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు, వ్యవసాయధికారులు సంయుక్తంగా దాడి చేశారు. ఇందులో ముగ్గురు నిందితులు సిద్ధిక్, రాజేశ్, సదాశివుడుని అదుపులోకి తీసుకుని పెద్ద మొత్తంలో నకిలీ, గడువు తీరిన పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మట్టెవాడ పీఎస్‌లో విచారించారు. ప్రధాన నిందితుడు ఇరుకుళ్ల వేద ప్రకాశ్.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో స్థానిక వ్యాపారులు, పురుగు మందుల కంపెనీ ప్రతినిధి అయిన మరో నిందితుడు సిద్ధిక్ వద్ద కాలం తీరిన పురుగు మందులను కొనుగోలు చేసేవాడు. అలాగే, గడువు దాటిన పురుగు మందులతోపాటు, ఇద్దరు నిందితులైన ఆళ్ల చెరువు శేఖర్, విష్ణువర్ధన్, ప్రస్తుతం జైలులో ఉన్న ఆదిత్య నుంచి ప్రముఖ పురుగు కంపెనీలైన ధనూక, టాటా, రైల్స్, బెయర్, ఆడ్మాతోపాటు మరికొన్ని కంపెనీ పేర్లతో తయారు చేసిన నకిలీ పురుగు మందులు కొనుగోలు చేసేవాడు. ఈ విధంగా సేకరించిన గడువు తీరిన పురుగు మందులతోపాటు నకిలీ పురుగు మందులను ప్రభుత్వ అనుమతులు లేని మిగతా నిందితులకు విక్రయించాడు. ఈ నకిలీ పురుగు మందులను కొనుగోలు చేసిన నిందితులు.. వీటిని స్థానికంగా ఉన్న వ్యవసాయదారులకు విక్రయిస్తూ మోసగించేవారు. పోలీసులు అరెస్ట్ చేసిన ప్రధాన నిందితుడు ఇరుకుళ్ల వేదప్రకాశ్‌తో పాటు సదాశివుడు, రాజు ఆదిత్య గతంలోనూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ప్రధాన నిందితుడి సమాచారం మేరకు ఆళ్ల చెరువు శేఖర్, విష్ణువర్ధన్ గోదాములపై టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు దాడులు చేశారు. నిందితుల్లో విష్ణువర్ధన్ పరారీలో ఉన్నాడు. మరో వ్యక్తి ముద్దగుల ఆదిత్య హైదరాబాద్ జైలులో ఉండగా.. మిగతా ఏడుగురు మట్టెవాడకు చెందిన ఇరుకుల్ల వేదప్రకాశ్, లక్ష్మీపురానికి చెందిన మహ్మద్ సిద్ధిక్ అలీ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన నూక రాజేశ్ అలియాస్ రాజు, కరీంనగర్‌కు చెందిన యల్లం సదాశివుడు, ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన ఎండీ రఫీక్, ఏపీలోని ప్రకాశం జిల్లా మడుగుకు చెందిన ఆళ్ల చెరువు శేఖర్, దుగ్గొండికి చెందిన పాదిళ్ల సాంబయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్లు గోపి, రాజు, ఎస్సైలు వంశీకృష్ణ, నవీన్, ఆర్ఎస్సై భాను ప్రకాశ్, ఏఏఓ సల్మాన్‌పాషా, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు సురేశ్, సురేందర్, సాంబరాజు, శ్రీనివాస్, సతీశ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేటకు వెళ్లి.. ఉచ్చుకు తగిలి

- కరెంట్ షాక్‌కు గురై వ్యక్తికి తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతూ మృతి



గంగయ్య(ఫైల్)

ఏటూరునాగారం: అటవీ జంతువులను వేటాడటానికి వెళ్లిన ఓ వ్యక్తి.. కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని కొత్తగుడిసెల ప్రాంతానికి చెందిన తుమ్మ గంగయ్య(50), లొటపెటల నారాయణ, ఎద్దు లోకేశ్ కలిసి శుక్రవారం అర్ధరాత్రి చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు వెళ్లారు. ముగ్గురు కలిసి 33 కేవీ విద్యుత్‌లైన్‌కు కరెంట్ ఉచ్చులు తగిలించే ప్రయత్నం చేశారు. ఇందులో గంగయ్య కర్ర పట్టుకుని కరెంట్ వైర్లకు ఉచ్చుకు అమర్చిన వైర్ తగిలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన లోకేశ్, నారాయణ భయభ్రాంతులకు గురై అక్కడి నుంచి వచ్చి కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శనివారం ఉదయం ఘటనా స్థలికి చేరుకుని అతడిని రెండు కిలోమీటర్ల మోసుకుంటూ బయటకు తీసుకొచ్చారు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రుడిని 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ ఈ ఘటనలో లోకేశ్, లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు కూతుళ్లు మౌనిక, అనిత ఉన్నారు.

సౌర ప్లాంట్‌తో రైతులు ఆర్థికంగా బలోపేతం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుతో రైతులు ఆర్థికంగా బలోపేతమవుతారని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్‌కో) సంయుక్తంగా శనివారం ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ల కార్యాలయంలో 'కుసుమ్' పథకం కింద దరఖాస్తు చేసుకున్న రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి సీఎండీ వరుణ్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడారు. రైతులు సౌర శక్తిని ఉత్పత్తి చేసి మరింత ఆదాయం సమకూర్చుకోవడానికి ఇది సువర్ణ అవకాశమన్నారు. సోలార్ ద్వారా ఉత్పత్తి చేసిన ప్రతీ యూనిట్‌కు రూ.3.13 ఇస్తామని, ప్రతీ నెల రైతు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. రూ.2 కోట్ల వరకు ఆరు శాతం వడ్డీకి బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులు ఈ నెల 28 వరకు రూ.లక్ష పూచీకత్తు సొమ్ము డిపాజిట్ చేయాలన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పూచీకత్తు సొమ్ము చెల్లిస్తామన్నారు. 25 ఏళ్ల అగ్రిమెంట్‌తో రైతులు లాభాలతో కూడిన నిలకడ ఆదాయం పొందొచ్చన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు కె.వెంకటరమణ, రాజుచౌహాన్, జీఎం మల్లికార్జున్, టీజీ రెడ్కో డీజీఎం. వెంకటరమణ, డీఈలు అమర్‌నాథ్, సంపత్‌రెడ్డి, ఏఈ శ్రీపాల్ పాల్గొన్నారు.

ఆరోగ్యం కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలి

- ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయ భాను



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను, అధికారులు

హన్మకొండ: వేసవిలో ఆరోగ్యం కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలని టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను డిపో మేనేజర్లు, సిబ్బందికి సూచించారు. శనివారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలోని 9 డిపోల మేనేజర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమ్మర్ చాలెంజ్‌ను విజయవంతంగా నిర్వహించాలన్నారు. డీహైడ్రేషన్ నివారణకు రోజు తగిన మోతాదులో నీరు, మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరి నీరు తీసుకోవాలన్నారు. విధులు ముగిసిన తర్వాత తగిన విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఎలాంటి లీవ్‌లు, సిక్ లీవ్ తీసుకోని, గైర్హాజర్ కాకుండా డ్యూటీలకు హాజరైన వారికి ప్రోత్సాహాలు అందించనున్నట్లు చెప్పారు. మార్చి నుంచి జూన్ మాసాంతం వరకు మరింత శ్రద్ధతో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తూ డిపోల ఆర్థికాభివృద్ధికి, తద్వారా రీజియన్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె.భానుకిరణ్, అకౌంట్స్ ఆఫీసర్ రవీందర్ రావు, డిపోల డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.